సాక్షి
తిరుపతి
బుధవారం । 21 । మే । 2025



త్వరలోనే బీఎన్ కండ్రిగలో చేనేత క్లస్టర్

బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో త్వరలోనే చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయనున్నట్లు ఏడీ రమేష్ తెలిపారు. - 8లో



పకడ్బందీ 'వసతి'కి ప్రత్యేక శ్రద్ధ

జిల్లాలోని హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించాలని, పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని కలెక్టర్ ఆదేశించారు. - 8లో



జాబ్ మేళాలో 232 మంది ఎంపిక

గూడూరు డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. 232 మంది ఉద్యోగాలు పొందారు. - 8లో

పెన్నాలో సైఖితం!



నదిలో అక్రమ తవ్వకం

వెంకటగిరి నియోజకవర్గంలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ప్రధానంగా పెన్నా నదిలో ఇష్టారాజ్యంగా తవ్వకాలు సాగిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా భారీ యంత్రాలతో సై'ఖతం' చేసేస్తున్నారు. వందలాది వాహనాల్లో పొరుగు రాష్ట్రాలకు తరలించేస్తున్నారు. అక్రమార్కులను నిలువరించాల్సిన స్థానిక ప్రజాప్రతినిధి మాత్రం ముడుపులు తీసుకుని అక్రమ రీచ్‌లను ప్రోత్సహిస్తున్నారు. రాత్రింబవళ్లు ఇసుకను దోచేస్తున్నప్పటికీ కాసుల కోసం పూర్తి సహకారం అందిస్తున్నారు. ఈ క్రమంలోనే అధికారులు సైతం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణను విస్మరించి మామూళ్ల మత్తులో జోగుతున్నారు.

- రెచ్చిపోతున్న ఇసుకాసురులు
- రాజుపాళెం, తెలుగురాయపురంలో అక్రమ రీచ్‌లు
- నిత్యం తరలిపోతున్న 3,200 మెట్రిక్ టన్నులు
- పర్యావరణానికి యథేచ్ఛగా తూట్లు
- పట్టించుకోని అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : వెంకటగిరి నియోజకవర్గంలో ఇసుక తోడేళ్లు పేట్రేగిపోతున్నాయి. టీడీపీకి చెందిన ఓ నేత కనుసన్నల్లో దందా సాగిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.కోట్ల విలువైన ఇసుకను యథేచ్ఛగా దోచుకున్నాయి. కలువాయి మండలం రాజుపాళెం, తెలుగురాయపురం సమీపంలోని పెన్నానదిలో ఇసుక తవ్వకాలకు ప్రధానంగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతి ఉండాలి. అయితే ఎన్‌జీటీ అనుమతి లేకుండానే టీడీపీ నేతలు, కార్యకర్తలు ఇసుక రేవుల్లో పడి దోచేస్తున్నారు.



హైవేలోకి వస్తున్న ఇసుక టిప్పర్లు

సరికొత్త దారిలో..



వెంకటరెడ్డిపల్లె మీదుగా ఇసుకను రవాణా కోసం వేసిన రహదారి

ఇసుక మాఫియా రోజుకో మార్గం ఎంచుకుని అక్రమ రవాణా సాగిస్తోంది. రాజుపాళెం, తెలుగురాయపురం మీదుగా కాకుండా ఇప్పుడు తాజాగా వెంకటరెడ్డిపల్లె వంతెన సమీపంలోని అటవీ ప్రాంతం గుండా ఇసుకను రవాణా చేస్తోంది. ఇందుకోసం స్థానిక రైతుకు కొంత నగదు ఇచ్చి ఆయన పొలంలో బాట వేసుకుంది. ఈకొత్త రూట్ ద్వారా రాత్రి పూటహైవే మీదుగా భారీ వాహనాల్లో ఇసుకను తరలించేస్తోంది.

వాటా ఇచ్చి తరలింపు

రాజాపాళెం, తెలుగురాయపురంలోని అక్రమ రీచ్‌ల నుంచి ఇసుక తరలించేందుకు నియోజకవర్గ ప్రజాప్రతినిధికి యూనిట్‌కు రూ.వెయ్యి చొప్పున వాటాను ఇసుకాసురులు ముట్టజెపుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడి నుంచి నిత్యం సగటున వంద వాహనాల్లో ఇసుక తరలిపోతున్నట్లు సమాచారం. ప్రతి వాహనానికి రూ. 8 యూనిట్లు లెక్కన నిత్యం 800 యూనిట్ల ఇసుకను ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. ప్రజా ప్రతినిధి అండతో ఇసుక మాఫియా బరితెగించి రాత్రి పగలు తేడాలేకుండా తవ్వకాలు సాగిస్తోంది. భారీ వాహనాల్లో ఇసుక వెళ్లిపోతోంది. ఆయా మార్గాల్లో నివసించేవారికి ఈ వాహనాల రణగొని ధ్వనులతో నిద్ర కరువవుతోంది. ఇళ్లు దుమ్మకొట్టుకుపోతున్నాయి. రహదారులు సైతం ఛిద్రమవుతున్నాయి. పోలీసు, రెవెన్యూ , మైనింగ్ అధికారులు ఈ అక్రమర్జనలో భాగస్వాములైనట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

స్పందించని అధికార యంత్రాంగం

పర్యావరణానికి తూట్లు పొడుస్తూ పెన్నానదిలోకి ఇసుకాసురులు దారి వేసుకున్నారు. నదీ గర్భంలోకి రోడ్డు వేసినప్పటికీ అధికారులు ఏమాత్రం స్పందించడం లేదు. ఇటీవల దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో రహదారిని మూసివేసినట్లుగా హడావుడిగా ఫ్లెక్సీ ఏర్పాటు చేసి చేతులుదులిపేసుకున్నారు. అయితే గంటల వ్యవధిలోనే ఆ ఫ్లెక్సీల వించివేసి ఇసుకాసురులు వాహనాల రాకపోకలను ప్రారంభించేశారు. టీడీపీ నేతల సహకారంతో అక్రమార్కులు ఇసుక దోపిడీ చేస్తుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ

తిరుపతి అర్బన్ : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ఉద్యోగం కోసం ప్రయత్నించే అభ్యర్థులకు ఉచితం స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ సతీష్ చంద్ర తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరంలోని ఎస్వీ మెడికల్ కళాశాల ఎదురుగా ఉన్న ఎన్ఏసీ కేంద్రంలో 30 రోజుల పాటు అసిస్టెంట్ సర్వేయర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ పోస్టులకు సంబంధించి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీపై ట్రైనింగ్ ఉంటుందని వెల్లడించారు. 15 నుంచి 45ఏళ్ల వారు శిక్షణకు రావచ్చన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో రావాలని కోరారు. ఈక్రమంలో ముందుగా నైపుణ్యం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 9701440274, 9703437472, 9866241270 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

తిరుమలలో కొనసాగుతున్న తనిఖీలు



కొండపై తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

తిరుమల : తిరుమలలో భద్రతా ఏర్పాట్లకు సంబంధించి టీటీడీ సీవీఎస్‌ఓ హర్షవర్ధన్‌రాజు పకడ్బందీగా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే మూడోరోజు మంగళవారం సైతం పోలీసులు, విజిలెన్స్, ఆరోగ్య, అగ్నిమాపక, విద్యుత్‌శాఖల అధికారులు తనిఖీలు కొనసాగిస్తున్నారు. తిరుమలలోని పార్కులు, నిర్మానుష్య ప్రాంతాలు, భవన నిర్మాణాలను పరిశీలించారు. ఆయా చోట్ల కూలీలను ఆరా తీశారు. అనంతరం ఫొటో స్టూడియోలు, దుకాణాలను తనిఖీ చేశారు. అనధికార వ్యక్తులు కొండ నుంచి వెళ్లిపోవాలని హెచ్చరికలు జారీ చేశారు.

టీటీడీ సీవీఎస్‌ఓగా మురళీకృష్ణ



తిరుమల : టీటీడీ ముఖ్య నిఘా, భద్రతాధికారి (సీవీఎస్‌ఓ)గా కేవీ మురళీకృష్ణను నియమిస్తూ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం విశాఖపట్నం, 16వ బెటాలియన్ కమాండెంట్‌గా మురళీకృష్ణ విధులు నిర్వర్తిస్తున్నారు.గతంలో ఆయన తిరుపతిలోని మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా, అదనపు ఎస్పీగా, తిరుమల అదనపు ఎస్పీగా అనంతరం అనంతపురం ఎస్పీగా, అనకాపల్లి ఎస్పీగా పనిచేయడం గమనార్హం.

అగ్ని ప్రమాదంలో దంపతులకు గాయాలు

రేణిగుంట : మండలంలోని వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీలో మంగళవారం సంభవించిన అగ్నిప్రమాదంలో భార్యాభర్తలు గాయపడ్డారు. వివరాలు.. కాలనీలో నివసిస్తున్న సుబ్బయ్య భార్య రాణి ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుంది. ఆమె కేకలు వేయడంతో కాపాడేందుకు సుబయ్య యత్నించగా ఆయనకు సైతం మంటలు తగిలాయి. ఈ ప్రమాదంలో రాణికి 60శాతం, సుబ్బయ్యకు 20శాతం శరీరం కాలిపోయింది. బాధితులను వెంటనే తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

సైదాపురం : శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా విడవలూరు పంచాయతీ కార్యదర్శి యజ్డానీబాషాను సస్పెండ్ చేస్తూ పీఆర్ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. యజ్డానీబాషా గతంలో సైదాపురం పంచాయతీ కార్యదర్శిగా పనిచేసేప్పుడు రూ.20,33,646 ఉపాధి నిధులను నేరుగా విత్‌డ్రా చేసినందుకు సస్పెండ్ చేస్తున్నామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నాడు–నేడు పథకం కింద సచివాలయ భవనాల నిర్మాణం కోసం వెచ్చించిన ఉపాధి నిధులు పక్కదారి పట్టాయని ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ చేపట్టారు. దీనిపై కమిషనర్ చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.

కూలిన బతుకులు



కార్పొరేషన్ సిబ్బంది కూల్చేసిన దుకాణాలు



జేసీబీతో షాపును తొలగిస్తున్న దృశ్యం

నిరుపేదలపై కార్పొరేషన్ అధికారులు తమ ప్రతాపం చూపించారు. చిరు వ్యాపారాలు చేసుకునే వారి పొట్టకొట్టేశారు. పండ్లు.. కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగించేవారి బతుకులను నిలువునా కూల్చేశారు. మంగళవారం ఉదయం తిరుపతి నగరంలోని బొంతాలమ్మగుడికి ఇరువైపులా ఫుట్‌పాత్‌పై చిన్న చిన్న దుకాణాలను నిర్వహించే వారిపై ఇష్టారాజ్యంగా జులుం ప్రదర్శించారు. ప్రత్యామ్నాయ స్థలం చూపించకుండా జేసీబీలతో షాపులను తొలగించేశారు. కనికరించండి అంటూ బాధితులు కాళ్లావేళ్లా పడినా ఏమాత్రం పట్టించుకోకుండా పోలీసుల సాయంతో పక్కకు లాగి పడేశారు.

– తిరుపతి తుడా



రోడ్డుపై కూర్చుని విలపిస్తున్న దుకాణదారు

పకడ్బందీ వసతికి ప్రత్యేక శ్రద్ధ

తిరుపతి అర్బన్ : జిల్లాలోని హాస్టళ్లలో పకడ్బందీగా వసతులు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వసతిగృహాల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. పలు హాస్టళ్లలో చేపట్టిన మరమ్మతు పనులను నాణ్యతా ప్రమాణాల మేరకు పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అలాగే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని చెప్పారు. పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని స్పష్టం చేశారు. సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారం చూపుతామని తెలిపారు. సమావేశంలో ఎస్సీ హాస్టళ్ల అధికారి విక్రమకుమార్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి రాజేంద్రనాథ్‌రెడ్డి, అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల డీసీఓ గీత, ఇంజినీరింగ్ అధికారి బాలసుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

గ్రీవెన్స్ అర్జీలకు ప్రాధాన్యం

గ్రీవెన్స్‌లో వచ్చే అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్, డీఆర్‌ఓ నరసింహులతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రతి సోమవారం వచ్చే అర్జీలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రీ ఓపెన్‌కు ఆస్కారం లేకుండా వినతులను పరిష్కరించాలన్నారు. మండల, డివిజన్ స్థాయిలోను తప్పకుండా ప్రతి సోమవారం గ్రీవెన్స్ నిర్వహించాలని స్పష్టం చేశారు. చిన్న చిన్న సమస్యలను మండల, డివిజన్ స్థాయిలోనే పరిష్కరించాలని చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే దీపం పథకం ద్వారా అందిస్తున్న గ్యాస్ సిలిండర్లకు గడువులోపు రాయితీ నగదును వినియోగదారుల బ్యాంకు ఖాతాలో జమ చేయాలని ఆదేశించారు. రేషన్ దుకాణాల్లో నాణ్యమైన సరుకులను కార్డుదారులకు పంపిణీ చేయాలని కోరారు. బియ్యంతోపాటు అన్ని రకాల సరుకులు అందించాలని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ఆర్టీసీ బస్టాండ్లను మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీఓలు తరచూ తనిఖీ చేయాలని సూచించారు. పంచాయతీల్లో ప్రతి రోజూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా డోర్ టూ డోర్ సేకరించాలని తెలిపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోస్మాండ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

యూపీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

తిరుపతి అర్బన్: యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన పరీక్షల నిర్వహణపై డీఆర్వోతో కలసి మంగళవారం అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న జిల్లాలో 13 కేంద్రాల్లో 5,261 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30గంటల నుంచి 4.30 గంటల వరకు రెండు సెషన్స్‌లో పరీక్షలు ఉంటాయని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు తెలిపారు. బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, ఎట్టి పరిస్థితుల్లోను విద్యుత్ అంతరాయం ఉండరాదని ఆయన ఆదేశించారు. అంతేకాకుండా తాగునీరు వసతి, టాయిలెట్స్ సక్రమంగా ఉండాలని, కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలియజేశారు. ఈ సమావేశంలో తిరుపతి ఆర్డీవో రామమోహన్, తిరుపతి అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పిడుగుపాటుకు మహిళ మృతి

కేవీబీపురం : మండలంలోని ఆదరం గ్రామంలో మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై ఓ మహిళ మృతి చెందింది. వివరాలు.. తుపాకుల రాజా, చుక్కమ్మ దంపతులు కూలీ పని కోసం అటవీ ప్రాంతానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా రాత్రి 7 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో చుక్కమ్మ (26)పై పిడుగు పడడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. వారి వెంట వస్తున్న కుక్క సైతం మృత్యువాత పడింది. కళ్లెదుటే భార్య కన్నుమూయడంతో తుపాకుల రాజా భోరున విలపించాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

తిరుపతి రూరల్ : మండలంలోని మల్లంగుంట ఎస్టీ కాలనీకి చెందిన చిరంజీవి అనే వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందాడు. వివరాలు.. స్థానికంగా చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగించే చిరంజీవికి భార్య కృష్ణవేణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మద్యానికి బానిసైన చిరంజీవి కుటుంబాన్ని పట్టించుకునేవాడు కాదు. దీనిపై భార్య ప్రశ్నించడంతో ఈ నెల 18వ తేదీన అధికంగా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. కాసేపటికి నురగలు కక్కుతూ కింద పడిపోయాడు. దీంతో కుటుంబీకులు వెంటనే తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మరణించాడు. దీనిపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రిఫరెన్షియల్ కేటగిరీకి మెడికల్ సర్టిఫికెట్ తప్పనిసరి

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియలో ప్రిఫరెన్షియల్ కేటగిరీ వర్తించాలంటే నూతన మెడికల్ సర్టిఫికెట్ తప్పనిసరని డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు తప్పనిసరిగా మెడికల్ సర్టిఫికెట్ పొందాలని సూచించారు. బుధవారం ఉదయం 9గంటల నుంచి తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో నిర్వహించే ప్రత్యేక క్యాంపులో సంబంధిత వైద్యుల నుంచి మెడికల్ సర్టిఫికెట్ పొందాలని స్పష్టం చేశారు.

జిల్లాలో 171 ఆదర్శ గ్రామాలు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం కింద జిల్లాలో 171 ఆదర్శ గ్రామాలను ఎంపిక చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో మంగళవారం అధికారుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద ఒక్కో ఆదర్శ గ్రామానికి రూ.20లక్షలు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ఎంపీడీఓల నేతృత్వంలో పంచాయతీ కార్యదర్శులు ఈ నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుందని వివరించారు.

త్వరలోనే బీఎన్ కండ్రిగలో చేనేత క్లస్టర్

బుచ్చినాయుడుకండ్రిగ : బీఎన్ కండ్రిగ మండలంలో త్వరలోనే చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా చేనేతశాఖ ఏడీ రమేష్ తెలిపారు. ఆయన మంగళవారం మండలంలోని కల్లివెట్టు, తలారివెట్టులోని చేనేత కుటుంబాలతో మాట్లాడారు. అనంతరం గ్రామ సచివాలయంలో చేనేత కార్మికులు, మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ జిల్లాలోని బుచ్చినాయుడుకండ్రిగ, డక్కిలి, చిన్నగొట్టిగల్లు మండలాల్లో చేనేత క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ లక్ష్యాల మేరకు మహిళ సంఘాల్లోని చేనేత కార్మికులకు సబ్సిడీపై జాక్వర్డ్, మోటారైజ్డ్ లిఫ్టింగ్ డివైజ్ వంటి పరికరాలు అందించనున్నట్లు తెలిపారు. చేనేత క్లస్టర్ ద్వారా వస్త్రాలు విలువ పెంపుదల, బ్రాండింగ్, క్యూఆర్ కోడ్, మార్కెటింగ్ అవకాశాలను అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు. కార్యక్రమంలో చేనేత ఏడీఓ కిరణ్మయి, వెలుగు ఏపీఎం మునెయ్య, సీసీ వెంకటరత్నం, వీఓఏ మునిశేఖర్, సుభాషిణి పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో నిందితుడి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న కార్లు, నిందితుడితో పోలీసులు

బుచ్చినాయుడుకండ్రిగ : కార్లను అద్దెకు తీసుకుని నగదు చెల్లించకుండా, వాహనాలను తిరిగి అప్పగించకుండా మోసం చేసిన కేసులో నిందితుడిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. శ్రీకాళహస్తికి చెందిన జావీద్, శివ వద్ద ఐదు కార్లను నెల బాడుగకు సత్యవేడు మండలం మాదనపాళెం గ్రామానికి చెందిన చెంగయ్య అలియాస్ ప్రవీణ్ తీసుకున్నాడు. ఒక్కో కారుకు రూ.45వేల చొప్పున అద్దె చెల్లించేలా అగ్రిమెంట్ చేసుకున్నాడు. ఒక్క నెల మాత్రం బాడుగ సొమ్ము చెల్లించాడు. తర్వాత అద్దె నగదు ఇవ్వకుండా, కార్లను సైతం అప్పగించకుండా మోసం చేశాడు. దీంతో బాధితులు ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడు చెంగయ్యను అదుపులోకి తీసుకున్నారు. ఐదు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తిమ్మయ్య, ఎస్‌ఐ విశ్వనాథనాయుడు తెలిపారు.

ఐసెట్‌లో తిరుపతి విద్యార్థుల హవా

- టాప్ టెన్‌లో 7, 10 ర్యాంకులు కైవసం
- 2,759 మంది పరీక్షకు హాజరుకాగా 2,627మంది ఉత్తీర్ణత



వి.అజయ్‌కుమార్



మహేంద్రసాయి

తిరుపతి సిటీ: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల పరిధిలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో అడ్మిషన్లు పొందేందుకు నిర్వహించిన ఐసెట్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఆంధ్ర యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐసెట్‌కు తిరుపతి జిల్లా వ్యాప్తంగా 2,759 మంది విద్యార్థులు హాజరుకాగా 2,627 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో పురుషులు 1296 మంది, 1331 మంది మహిళలు ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాదిలాగే ఈ ఏడాది జిల్లాలో మహిళలదేపైచేయిగా నిలిచింది.

7, 10 ర్యాంకులు సాధించిన జిల్లా విద్యార్థులు

ఐసెట్ ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్తంగా టాప్‌టెన్‌లో 7వ, 10వ ర్యాంకులను తిరుపతి జిల్లాకు చెందిన విద్యార్థులు కై వసం చేసుకున్నారు. ఇందులో తిరుపతి నగరం సమీపంలోని వేదాంతపురానికి చెందిన వి అజయ్‌కుమార్ 7వ ర్యాంకు సాధించారు. ఈయన శ్రీసిటీ ఐఐటీలో బీటెక్ పూర్తి చేశారు. అజయ్‌కుమార్ తండ్రి వి మదనమోహన్ గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. సూళ్లూరు పేట, మన్నార్‌పోలూరుకు చెందిన మహిళా రైతు లక్ష్మీ కుమారుడు మహేంద్ర సాయి 10వ ర్యాంక్ సాధించాడు. ఈ విద్యార్థి ఆంధ్ర యూనివర్సిటీలో ఇటీవల బీటెక్ పూర్తి చేశాడు.

రిజిస్ట్రేషన్‌కు స్లాట్ తప్పనిసరి



అరుణ్‌కుమార్, ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్, తిరుపతి

తిరుపతి అర్బన్ : ఆస్తుల క్రయవిక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లకు తప్పనిసరిగా స్లాట్ బుక్ చేసుకోవాలని ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ అరుణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు చేపట్టారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 మధ్యలో స్లాట్లు బుక్ చేసుకోవచ్చునని చెప్పారు. ఆ మేరకు నిర్ణీత సమయంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామని వెల్లడించారు. ఒక సబ్ రిజిస్ట్రార్ ఉన్న కార్యాలయంలో గరిష్టంగా 39 స్లాట్లు, ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు ఉన్నచోట గరిష్టంగా 78 స్లాట్లను రోజూ కేటాయిస్తామని వివరించారు. పబ్లిక్ డేటా ఎంట్రీ సిస్టమ్ ద్వారా రిజిస్ట్రేషన్.ఏపీ.జీవో వీ.ఇన్‌లోని స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. అలాగే రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి స్లాట్ పొందవచ్చని తెలిపారు.

23న ఎస్వీయూలో జాబ్‌మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈనెల 23వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సిస్ బ్యాంక్, స్విగ్గీ, అపోలో టైర్స్ వంటి సంస్థల ప్రతినిధులు జాబ్‌మేళాలో పాల్గొంటారని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఏదేని డిగ్రీ, ఐటీఐ చేసిన ఆసక్తిగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9533889902, 7989810194 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

జాబ్ మేళాలో 232 మంది ఎంపిక

చిల్లకూరు : గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ మేళాకు మొత్తం 432 మంది అభ్యర్థులు హాజరుకాగా, వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు 232 మంది ఎంపికైనట్లు వెల్లడించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ, కళాశాల యాజమాన్యం, లక్ష్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా చేపట్టినట్లు చెప్పారు. గూడూరు ప్రాంతంలో వెయ్యి మందికి ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా 21 బహుళ జాతీయ కంపెనీలతో ఒప్పందం చేసుకున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఉద్యోగాలకు ఎంపిక కాని వారికి స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇప్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి లోకనాథం, వై.విద్యాసాగర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు, భానుచందర్, చెంచురాఘవయ్య, ఎంపీడీఓ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

కారాగారాలు.. కదలని పనులు

పోలీసు, న్యాయ వ్యవస్థలపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి కారణంగా మానవ హక్కులకు భంగం వాటిల్లుతోందనే విమర్శలొస్తున్నాయి. గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా జిల్లా కారాగారంతో పాటు మొత్తం 10 జైళ్లు ఉండేవి. ప్రస్తుతం అవి ఆరుకే పరిమితమయ్యాయి. పుత్తూరు, చంద్రగిరి, పలమనేరు, వాల్మీకిపురంలోని జైళ్లు శిథిలావస్థకు చేరడంతో వాటిని తొలగించారు. వాటి స్థానంలో కొత్తవి నిర్మిస్తామని శిలాఫలకాలు వేసిన పాలకులు నిర్మాణ పనులను దశాబ్దాలుగా గాలికి వదిలేశారు.

- పుత్తూరు, చంద్రగిరి, పలమనేరు, వాల్మీకిపురం జైళ్లు మూసివేత
- దశాబ్దాలు గడుస్తున్నా ఊసేలేని కొత్త కారాగారాల నిర్మాణం
- పట్టించుకోని ప్రభుత్వం

పుత్తూరు: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 10 జైళ్లు ఉండగా ఇందులో తిరుపతి, మదనపల్లె, పీలేరులోని సబ్‌జైళ్లు మాత్రం స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నిర్మించినవి. మిగిలినవన్నీ బ్రిటీష్ కాలంలో నిర్మించినవే. వీటిలో కొన్ని శిథిలావస్థకు చేరుతుండడంతో వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని భావించిన జైళ్లశాఖ అధికారులు పుత్తూరు, పలమనేరు, వాల్మీకిపురం, చంద్రగిరి సబ్ జైళ్లను మూసివేశారు. దీంతో ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జైళ్ల సంఖ్య ఆరుకే పరిమితమయ్యాయి. మూసివేసిన పుత్తూరులో సబ్‌జైల్ స్థానంలో నూతన భవన నిర్మాణానికి నందిమంగళం రెవెన్యూ లెక్క దాఖలాలోని సర్వే నంబర్ 242/22లో 2 ఎకరాల భూమిని రాష్ట్ర జైళ్ల శాఖకు స్థానిక రెవెన్యూ శాఖ కేటాయించింది. ఈ మేరకు 2010 జూన్ 18న అప్పటి జైళ్ల శాఖ ఐజీ గోపీనాథ్‌రెడ్డి నూతన జైలు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే అది ఇప్పటి వరకూ కార్యరూపం దాల్చలేదు. పలమనేరులోని జైలును సైతం మూసివేసిన అధికారులు ఆ స్థలంలో పెట్రోల్ బంకు నిర్మాణ పనులు ప్రారంభించారు. అలాగే వాల్మీకిపురంలోని జైలును మూసివేసి తిరుపతి–మదనపల్లె మార్గంలో రూ.4 కోట్ల అంచనాతో జైలు నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే ఈ భవన నిర్మాణ పనులు సగానికి పైగా పూర్తయిన తర్వాత అర్థాంతరంగా ఆగిపోయి ఏళ్లు గడుస్తుండడంతో కొత్త భవనం సైతం శిథిలావస్థకు చేరుతోంది. అలాగే చంద్రగిరిలోని కారాగారం శిథిలావస్థకు చేరడంతో దానినీ మూసివేశారు. ఇలా ఉన్న జైళ్లను తొలగించడంతో పుత్తూరు సబ్‌కోర్టు ద్వారా శిక్షలు పడిన ఖైదీలను 70 కిలోమీటర్ల దూరంలోని సత్యవేడు సబ్‌జైలుకు, అలాగే పలమనేరు, వాల్మీకిపురం కోర్టుల్లో శిక్షలు పడిన ఖైదీలను పీలేరులోని సబ్‌జైలుకు తరలిస్తున్నారు. ఇది పోలీసులతో పాటు ఖైదీలకు, వారి కుటుంబీకులకు వ్యయ ప్రయాసలతో కూడుకుంటోంది. అలాగే జైళ్లలోని గదులు చాలక ఖైదీలను ఎక్కువ మందిని ఒకే సెల్‌లో నిర్బంధించాల్సిన పరిస్థితి. ఈ దుస్థితి 15 ఏళ్లుగా ఉంటున్నా పాలకులు పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు.



వాల్మీకిపురంలో నూతన జైలు భవనం దుస్థితి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని జైళ్ల కేంద్రాలు

- చిత్తూరు (జిల్లా కారాగారం)
- తిరుపతి
- మదనపల్లె
- పీలేరు
- శ్రీకాళహస్తి
- సత్యవేడు

మూసివేసిన కేంద్రాలు

- పుత్తూరు
- పలమనేరు
- చంద్రగిరి
- వాల్మీకిపురం



పుత్తూరులో జైలు నిర్మాణానికి కేటాయించిన స్థలం



చిత్తూరు జిల్లా కారాగారం

ఖైదీలకు మెరుగైన సేవలు

ఖైదీలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని జిల్లా జైలు అధికారి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా ఉన్న జైళ్లలో 306 మంది ఖైదీలున్నారనీ, చిత్తూరు జిల్లా కారాగారంలోనే 130 మంది ఉన్నారని తెలిపారు. ఇక్కడ ఓపెన్ స్కూల్ నడుపుతున్నామనీ, గత ఏడాది 11 మంది, ఈ ఏడాది ఐదుగురు పదో తరగతి పరీక్షలు రాసి ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యారని చెప్పారు. అన్ని జైళ్లలో స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్ కింద శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ పొందిన వారికి కలెక్టర్ ద్వారా సర్టిఫికెట్లు అందజేశామన్నారు. వారు జైలు నుంచి విడుదలయ్యాక బ్యాంకు రుణాలు పొంది కొత్త జీవితం ప్రారంభించవచ్చని చెప్పారు. ఖైదీలతో యోగా, వ్యాయామం చేయిస్తున్నారని, మహిళా ఖైదీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు వివరించారు.

ప్రతిపాదనలు పంపించాం



వాల్మీకిపురంలో జైలు నిర్మాణానికి 2012లో రూ.4 కోట్లు మంజూరైంది. తొలిదశలో రూ.2 కోట్లు విడుదల కాగా అంతవరకు పనులు జరిగి ఆగిపోయాయి. ఇటీవలే కొత్త ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. పలమనేరులో జైలును 15 ఏళ్ల క్రితమే మూసివేశారు. 40 సెంట్లు మాత్రమే ఉన్న ఆ స్థలంలో నూతన జైలు నిర్మాణానికి అవకాశం లేదు. ఇక్కడ స్థలాన్ని ఐఓసీ పెట్రోల్ బంకుకు కేటాయించాం. పలమనేరులో మరోచోట జైలు నిర్మాణానికి 5 ఎకరాల స్థలం కావాలని జిల్లా కలెక్టర్‌ను నివేదిక సమర్పించాం. అది పరిశీలనలో ఉంది. పుత్తూరులో జైలు నిర్మాణానికి నిధులు మంజూరు కావల్సి ఉంది.

– ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా జైలు అధికారి, చిత్తూరు